
అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ జగదీష్


క్లాక్‌టవర్ వద్ద శోభాయాత్ర


జై... జై... గణేశా..

జై.. గణేశ్..

వర్షంలోనూ వినాయకుడి శోభాయాత్ర

కోలాహలంగా నిమజ్జనం

అనంతపురం టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఐదురోజులపాటు విశేష పూజలందుకున్న గణనాథుడి శోభాయాత్ర ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. పలు మండపాలవద్ద పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దారిపొడవునా బారులుతీరిన భక్తులు... ఆకట్టుకునే వేషధారణలు... రంగులద్దిన మోములతో యువత కేరింతల నడుమ గణపతిని.. గంగమ్మ ఒడికి చేర్చారు. వినాయకచవితి వేడుకల ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో వినాయక్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన ముగింపు సభకు సరస్వతి విద్యా మందిరాల వ్యవస్థాపకుడు లక్ష్మణరావుతోపాటు ఎస్పీ జగదీష్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నగరపాలక సంస్థ మేయర్ వసీం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత ఉత్సవాల ముగింపు సూచికగా ధ్వజారోహణ చేసారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ... నగరంలో వెయ్యికిపైగా విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారనీ, అవాంఛనీయ ఘటనలు తావులేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన సభలో సరస్వతి విద్యామందిరాల వ్యవస్థాపకుడు లక్ష్మణరావు మాట్లాడుతూ... ప్రపంచానికంతా శాంతి నేర్పడమే హిందూ తత్వం అని పేర్కొన్నారు. హిందూ ధర్మం శాస్త్రబద్ధమైన జీవన విధానాన్ని నేర్పుతోందన్నారు. అందరినీ కలుపుకుపోవడమే హిందూ తత్వమని, అందుకే ఇళ్లలో మాత్రమే జరుపుకునే వినాయకచవితి పండుగ వాడవాడలా కాలనీలు, కూడళ్లలో మండపాలు ఏర్పాటు చేసి కుటుంబాలను కలిపే పండుగగా రూపాంతరం చెందిందన్నారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ డిప్యూటి మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, రాయల్ మురళి, బీజేపీ నేత సందిరెడ్డి శ్రీనివాసులు, ఉత్సవ సమితి కార్యాధ్యక్షుడు పరుచూరి రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్, టీడీపీ నాయకుడు బాంబే డైయింగ్ నాగన్న, రామచంద్రయ్య, వేణుగోపాల్, రాయల్ మురళి, లలిత్‌కుమార్, రత్నమయ్య పాల్గొన్నారు.

రూ.2.51లక్షలు పలికిన లడ్డూ

సప్తగిరి సర్కిల్ వినాయక మండపం వద్ద ఐదురోజులుగా స్వామివారి ముందు ఉంచి పూజలు నిర్వహించిన లడ్డూను వేలం నిర్వహించగా నగరానికి చెందిన అమర్నాథ్ నాయుడు దక్కించుకున్నారు. గతేడాది రూ.2.04లక్షలు పలికిన లడ్డూ ఈసారి రూ.2.51లక్షలు ధర పలికింది. దాదాపు 15 మంది వేలంలో పోటీపడగా అమర్నాథ్ నాయుడు రూ.2.51లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.

వర్షంలోనే శోభాయాత్ర...

సప్తగిరి సర్కిల్ వినాయకుడి శోభాయాత్ర మొదలవగానే నగరంలోని ఇతర అన్ని ప్రాంతాల నుంచి విగ్రహాలు నిమజ్జనానికి తరలుతుంటాయి. ఆదివారం సాయంత్రం సప్తగిరి సర్కిల్ వినాయకుడి శోభాయాత్ర మొదలవగానే గంటపాటు వర్షం ఏకధాటిగా కురిసింది. వర్షంలోనే తడుస్తూ భక్తులు శోభాయాత్రలో పాల్గొన్నారు. ఓం సంగీత నృత్య కోలాట నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య బృందంతోపాటు భక్తులు వర్షంలోనే నృత్యాలు చేస్తూ స్వామివారికి నృత్యనీరాజనం పలికారు.


శోభాయాత్రలో యువత సందడి

పటిష్ఠ బందోబస్తు

అనంతపురం క్రైం (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి ఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతపురం రూరల్, అర్బన్ డీఎస్పీలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు నిమజ్జన ప్రక్రియను పర్యవేక్షించారు. నిమజ్జన ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. శోభాయాత్రలో అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా వందలాది మంది పోలీసు సిబ్బందిని మోహరించారు.


డ్యాన్స్ చేస్తున్న యువతులు


డ్రమ్స్‌తో మహిళల సందడి


ఊరేగింపులో సందడి

నిగ్గు తేల్చినా చర్యలేవీ..?

వైసీపీ హయాంలో యథేచ్ఛగా భూదందా

ఫ్రీహోల్డ్ అక్రమార్కులపై ఉదాసీనత

పట్టించుకోని యంత్రాంగం


ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

పుట్టపర్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అధికారం చేతిలో ఉంది కదా అని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలకు రెవెన్యూ యంత్రాంగం అసైన్డ్ భూములను అడ్డగోలుగా అప్పగించింది. పేదల నుంచి కాజేసిన కోట్ల విలువైన భూములు నేటికి భూ అక్రమార్కుల ఆధీనంలోనే ఉన్నాయి. ఫ్రీహోల్డ్ పేరుతో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూఅక్రమాలపై ఏడాది కిందట కూటమి సర్కారు క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించింది. ఫ్రీహోల్డ్, నిషేధిత భూములను వైసీపీ నేతలకు లబ్ధి చేకూర్చడంలో రాష్ట్రంలోనే జిల్లా మూడో స్థానంలో నిలిచింది. అక్రమ రిజిస్ట్రేషన్లలోనూ పది మండలాల్లో భారీగా వెలుగుచూశాయి. ఫ్రీహోల్డ్ అక్రమాల్లో ఏకంగా 1,26,215 ఎకరాలు అడ్డగోలుగా కట్టబెట్టినట్లు లెక్కతేల్చారు. అప్పట్లో వైసీపీ నేతలతో అంటకాగిన రెవెన్యూ అధికారులు పేదల భూములను ఆయాచితంగా రియల్ వ్యాపారులకు కట్టబెట్టారు. రెవెన్యూ అధికారుల అక్రమాలు నిర్ధారణ చేసి ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు.

లక్ష ఎకరాలకుపైగా కట్టబెట్టేశారు..

జగన్ పాలనలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని అసైన్డ్ ఫ్రీహోల్డ్ భూముల (యాజమాన్య హక్కుల కల్పన) ముసుగులో నిషిద్ధ 22(ఏ) జాబితా నుంచి అక్రమంగా తప్పించారు. 22(ఏ) ఫ్రీహోల్డ్ చేసి రిజిస్ట్రేషన్ జరిగిన అసైన్డ్ భూములపై గత ఏడాది కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అక్రమాలు నిగ్గు తేల్చింది. నాటి ఉత్తర్వుల ప్రకారం 2003కు ముందు అసైన్‌మెంట్ భూములకు మాత్రమే ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాల్సి ఉన్నా తర్వాత ఇచ్చిన వాటికి కూడా చోటు కల్పించారు. జిల్లా వ్యాప్తంగా జిల్లాలో 32 మండలాల్లో 2,57,042.47 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములను పరిశీలించగా.. ఏకంగా 1,26,215 ఎకరాలు అడ్డగోలుగా కట్టబెట్టినట్లు లెక్కతేల్చారు. ఇందులో రిజిస్ట్రేషన్ల జరిగినవి 5,242.08 ఎకరాలు, ఉత్తర్వుల మేరకు చేసినవి 3,101.07 ఎకరాలు కాగా నిబంధనలు అతిక్రమించి చేసినవి 2,141.01 ఎకరాలుగా లెక్క తేల్చారు. ఫ్రీహోల్డ్ చేసి రిజిస్ట్రేషన్ జరిగిన భూముల్లో అత్యధికంగా వైసీపీ నేతలతోపాటు వారి అనుకూల రియల్ వ్యాపారులు ఉన్నట్లు విచారణలో తేలింది.

కానరాని చర్యలు

రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ చేసిన భూములతోపాటు రిజిస్ట్రేషన్లల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగిన మండలాల జాబితాలో మొదటి స్థానంలో ముదిగుబ్బ, రెండో స్థానంలో అమరాపురం, మూడో స్థానంలో రామగిరి నిలవగా.. 6,7,9 స్థానాల్లో కనగానిపల్లి, సోమందేపల్లి, పెనుకొండ నిలిచాయి. ముదిగుబ్బలో 14,509.88 ఎకరాల్లో ఫ్రీహోల్డ్‌గా (మిగతా 5వ పేజీలో..)

అవినీతి డంపింగ్..!

పనులు చేయకనే రూ.13 కోట్లు స్వాహా

వైసీపీ ప్రజాప్రతినిధులు, అధికారుల కుమ్మక్కు

కూటమి ప్రభుత్వంలోనూ

వైసీపీ అభిమాన అధికారులదే హవా

ఎంపీ, ఎమ్మెల్యే లేఖలతో విజిలెన్స్ విచారణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వంలో చేసిన అక్రమాల్లో ఇదొక పెద్ద కుంభకోణం. వైసీపీ ప్రజాప్రతినిధులు, అప్పటి నగరపాలక సంస్థ అధికారులు కుమ్మక్కై డంపింగ్ యార్డులో బయోమైనింగ్ పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేశారు. డంపింగ్ యార్డులో కొండ కరగలేదు కానీ, నిధులు మాత్రం మింగేశారు. 2023లో డంపింగ్ యార్డులో బయోమైనింగ్ కోసం అప్పటి వైసీపీ ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ.26 కోట్లకు టెండర్లు పిలిచింది. పనులు సగం పూర్తి చేశామంటూ 2024లో వివిధ దశల్లో రూ.13కోట్ల వరకు బిల్లులు చేసుకుని వైసీపీ ప్రజాప్రతినిధులు, ఏఎంసీ అధికారులు స్వాహా చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి బిల్లులు చేయాల్సిన అప్పటి ఎగ్జామినర్లు (ఆడిటర్లు) కళ్లు మూసుకుని ఆమోదం తెలిపారు. డంపింగ్‌యార్డులో జరిగిన అక్రమాలపై అప్పటి సీడీఎంఏ క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు జరగకనే కోట్లాది రూపాయల బిల్లులను ఎలా మంజూరు చేశారని నిలదీశారు. కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్లు డంపింగ్‌యార్డులో జరిగిన అక్రమాలపై నిలదీసినా జవాబిచ్చేనాథుడే కరువయ్యారు. ఇందులో అప్పటి ఓ ఇంజనీరు కీలకంగా వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ఇంజనీరును సాగనంపగా... కడప జిల్లా నుంచి ఆ స్థానానికి వచ్చిన ఇంజనీరు అప్పట్లో ఏమీ జరగలేదని...అంతా సక్రమంగా జరిగిందని వత్తాసు పలికి వైసీపీ భక్తి చాటుకున్నారు. జూనియర్ అయిన ఆ ఇంజనీరుకు కీలక బాధ్యతలు అప్పజెప్పడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యే లేఖలతో డంపింగ్ యార్డు బయోమైనింగ్‌లో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన కోట్లాది రూపాయల అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టారు. డంపింగ్‌యార్డులో అక్రమాలపై కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్లు నిలదీసినా అప్పటి ఎమ్మెల్యే, మేయర్, అధికారులు నోరు మెదపలేదకపోవడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. అప్పటి ఎంపీ రంగయ్య హాజరైన కౌన్సిల్‌కు వైసీపీ కార్పొరేటర్లు లేవనెత్తిన సమయంలో అప్పటి ఎమ్మెల్యే గైర్హాజరు కావడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎంపీ, ఎమ్మెల్యే మొదటి కౌన్సిల్ సమావేశంలోనే డంపింగ్‌యార్డులో బయోమైనింగ్‌పై ఖర్చు చేసిన సొమ్ముపై విచారణ జరిపించాలని కలెక్టర్‌కు లేఖరాయడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విచారణ (మిగతా 5వ పేజీలో)


డంపింగ్ యార్డు

నేడు కలెక్టరేట్‌లో
ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు.


చిరుజల్లులు..

అనంతపురం అర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం చిరుజల్లులు పడ్డాయి. అనంతపురం, యాడికి, గార్లదిన్నె, పుట్లూరు, గుత్తి, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. మిగతా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమైనా వర్షం పడలేదు.

నేటి నుంచి రైతు బజారులో
ఉల్లి విక్రయాలు

- కిలో రూ.12తో అమ్మకం

అనంతపురంరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైతు బజారులో సోమవారం నుంచి ఉల్లి విక్రయాలు నిర్వహిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. నాలుగు టన్నుల ఉల్లిగడ్డలు జిల్లాకు వచ్చాయని పేర్కొన్నారు. కిలో రూ.12తో విక్రయిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


రైతు బజారులో విక్రయానికి ఉంచిన ఉల్లి బస్తాలు

నేడు పింఛన్ల పంపిణీ

నోటీసులు జారీచేసిన దివ్యాంగులకు పునరుద్ధరణ

అనంతపురం అర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెలకు సంబంధించి సోమవారం ఉదయం నుంచి ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ శైలజ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబరు నెలకు సంబంధించి జిల్లాలోని 2,82,872 మంది పింఛన్‌దారులకు రూ.126.10 కోట్ల పింఛన్ సొమ్మును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సోమ, మంగళవారాలు రెండు రోజులు పింఛన్ సొమ్మును అందజేస్తారన్నారు. తొలిరోజు ఎవరైనా పింఛన్ సొమ్ము తీసుకోకపోతే మరుసటి రోజు సచివాలయం వద్దకు వెళ్లి మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పింఛన్ సొమ్మును తీసుకోవాలని సూచించారు.

నోటీసులు అందుకున్న వారికి ఊరట

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ పునఃపరిశీలన ప్రక్రియ చేపట్టింది. జిల్లాలోని అనంతపురం సర్వజన ఆసుపత్రితోపాటు మరో ఆరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పింఛన్‌దారుల వైకల్యంపై పునఃపరిశీలన చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని 9,600 మంది దివ్యాంగులకు తాత్కాలికంగా పింఛన్లు నిలుపుదల చేస్తున్నట్లు సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేశారు. అర్హత కలిగిన దివ్యాంగుల పింఛన్లు నిలిపివేయడం అన్యాయమంటూ ఇటీవల దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, ఇతర నాయకుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున దివ్యాంగులు నిరసన చేపట్టారు. అలాగే అన్ని మండలాల్లో దివ్యాంగులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఇందుకు స్పందించిన ప్రభుత్వం నోటీసులు జారీచేసిన దివ్యాంగులకు సెప్టెంబరు నెలలో యథావిధంగా పింఛన్ల సొమ్మును అందించాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలోని 9,600 మంది దివ్యాంగులకు పింఛన్ల పునరుద్ధరించారు.

క్రైం కార్నర్

టెకీ హత్య

● ఘర్షణలో కత్తి పోటు
● ఆస్పత్రికి తరలించేలోగా మృతి


టెకీ శ్రీకాంత్ (ఫైల్)

కదిరి, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. వివాహమైంది.. కుమారుడు కూడా పుట్టాడు.. హాయిగా సాగిపోతున్న జీవితం.. మూడు నెలల బిడ్డకు నామకరణం చేద్దామని వచ్చాడు.. ఘర్షణలో ప్రాణాలు కోల్పోయాడు. తలుపులలోని బలిజపేట ప్రాంతానికి చెందిన టెకీ శ్రీకాంత్ (26). శనివారం అర్ధరాత్రి ఘర్షణలో ప్రాణాలు కోల్పోయాడు. తలుపుల ఎస్ఐ నరసింహుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలిజపేటకు చెందిన రాజారాం, అనిరుధ్ మధ్య ఆర్థిక లావాదేవీలున్నాయి. యాప్‌లు, బ్యాంకుల్లో రాజారాం ద్వారా అనిరుధ్ రుణాలు ఇప్పించేవాడు. అందుకుగాను అనిరుధ్.. రాజారాంకు బాకీ పడ్డాడు. దీనికోసం శనివారం రాత్రి రాజారాం తన మనుషులతో అనిరుధ్ ఇంటికెళ్లాడు. ఆ సమయంలో అనిరుధ్, కుటుంబసభ్యులు ఇంట్లో లేరు. ఆగ్రహంతో ఉన్న రాజారాం ఇంటిముందు ఉన్న ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేసి, వెళ్లిపోయాడు. అర్ధరాత్రి ఇంటికొచ్చిన అనిరుధ్ కుటుంబ సభ్యులు తమ్ముడు లక్ష్మీకర్, తండ్రి శ్రీనివాసులు, బామ్మర్ది శ్రీకాంత్ మరికొంతమంది.. రాజారాం ఇంటి వద్దకెళ్లారు. రాజారాం, అతడి తండ్రి వెంకటరాయప్ప, తరుణ్.. ఘర్షణకు దిగారు. రాజారాం కత్తితో శ్రీకాంత్ తొడభాగంలో పొడిచాడు. అధిక రక్తస్రావం కావడంతో హుటాహుటిన కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, చనిపోయినట్లు నిర్ధారించారు. ఇదే ఘటనలో శ్రీనివాసులు, లక్ష్మీకర్‌కు గాయాలయ్యాయి. శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న గాయపడిన వారి నుంచి కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐ నాగేంద్ర వివరాలు సేకరించారు.

కుమారుడి నామకరణం వేళ..: ఘర్షణలో మరణించిన శ్రీకాంత్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండేవాడు. ఆయనకు భార్య పవిత్ర, మూడు నెలల కుమారుడు ఉన్నాడు. కుమారుడి నామకరణం సోమవారం గ్రామంలో నిర్వహించాల్సి ఉంది. ఈ శుభ కార్యం కోసం స్వగ్రామానికి వచ్చారు. ఇంతలోనే హత్యకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

జ్వరంతో యువకుడి మృతి

బొమ్మనహాళ్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లికి చెందిన వరుణ్ (20) అనే యువకుడు ఆదివారం జర్వంతో మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. వరణ్‌కు కొద్ది రోజులుగా జ్వరంతో రావడంతో స్థానికంగానే వైద్యం చేయించుకున్నాడు. దీనికి తోడు పచ్చ కామెర్లు వచ్చినట్లు తెలిపారు. ఆదివారం వేకువజామున పొలంలో మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి అక్కడే పడిపోయాడు. ఉదయం 10 గంటలైన ఇంటికి రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు పొలంలోకి వెళ్లారు. అక్కడ పడిపోయి ఉన్న వరుణ్‌ను ఇంటికి తీసుకొచ్చి 108 వాహనంలో ఉరవకొండ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జ్వరంతో బాధపడుతున్న వరుణ్ ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో అస్వస్థతకు గురై మృతి చెందినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

హంద్రీనీవా కాలువలో వృద్ధురాలి మృతదేహం


సాలమ్మ మృతదేహం

కనగానపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హంద్రీనీవా కాలువలో ఆదివారం ఓ వృద్ధురాలి మృతదేహం కొట్టుకు వచ్చింది. తల్లిమడుగుల కాలువ వద్ద అటుగా వెళుతున్న స్థానికులు కాలువలో మహిళ తేలియాడుతుండటం గుర్తించారు. వెంటనే తాడు సహాయంతో వృద్ధురాలు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. వెం టనే పోలీసులు అక్కడికి వచ్చి విచారించగా మృతురాలు కూడేరు మండలం కరుట్లపల్లికి చెందిన చాకలి సాలమ్మగా(89)గా గుర్తించారు. ఈ ఘటనపై ఎస్ఐ మహ్మద్‌రిజ్వాన్‌ను వివరణ కోరగా.. శనివారం సాయంత్రం కరుట్లపల్లి సమీపంలో వృద్ధురాలు కాలువలో కాలుజారి పడ్డట్టు బాధితులు ఫిర్యాదు చేశారని, ఆ మేరకు విచారణ చేస్తున్నామని తెలిపారు.

నిగ్గు తేల్చినా చర్యలేవీ..?

(3వ పేజీ తరువాయి)

మార్చగా 13,538.48 ఎకరాలు అక్రమని తేలాయి. అమరాపురంలో 18,281.76గాను 10,781.27 ఎకరాలు, రామగిరిలో 19,877.20కిగాను 10,410.83, కనగానిపల్లిలో 14,039.83కి గాను 8300.08, సోమందేపల్లిలో 10,582.38కి గాను 7785.90, పెనుకొండలో 16,205.06కి గాను 7,501.68 ఎకరాలను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారు. పెనుకొండలో నాగలూరు, ఎర్రమంచి, శెట్టిపల్లి, మునిమడుగు, ధర్మవరంలో కుణుతూరు, చిగిచెర్లలో భారీగా ఫ్రీహోల్డ్‌లో అక్రమాలు జరిగినట్లు వెలుగుచూశాయి. ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో జరిగిన రిజిస్ట్రేషన్లులోనూ రాష్ట్రంలో టాప్ 10లో పెనుకొండ మొదటి స్థానంలో నిలవగా మూడో స్థానంలో ధర్మవరం, 6,9 స్థానాల్లో సోమందేపల్లి, రొద్దం నిలిచాయి. జిల్లా వ్యాప్తంగా ఫ్రీహోల్డ్ కల్పించిన భూముల్లో రిజిస్ట్రేషన్లు జరిగిన 5,242.08 ఎకరాల్లో నిబంధనలు అతిక్రమించి చేసినవి 2,141.01 ఎకరాలుగా నిగ్గుతేల్చారు. పెనుకొండ, ధర్మవరం, చిలమత్తూరు, హిందూపురం, బుక్కపట్నం, సీకేపల్లి, కదిరి, మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అత్యధికంగా ఫ్రీహోల్డ్ అసైన్డ్ రిజిస్ట్రేషన్ జరిగాయి. పెనుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోనే సోమందేపల్లి, రొద్దం, పెనుకొండ మండలాల్లో ఫ్రీహోల్డ్ చేసిన రిజిస్ట్రేషన్లలో వ్యత్యాసాలతోపాటు అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. పెనుకొండలో 827.39 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయగా 326.10 ఎకరాలు, ధర్మవరంలో 372.11ఎకరాల్లో 264.49 ఎకరాలు, సోమందేపల్లిలో 458.98 ఎకరాల్లో 207.56 ఎకరాలు, రొద్దంలో 442.04 ఎకరాల్లో 194.15 ఎకరాలు అక్రమంగా చేసినట్లు గుర్తించారు. ఫ్రీహోల్డ్ అక్రమాలపై గత ఏడాది జూలైలో విచారణ ప్రారంభించి ఈ ఏడాది మార్చి నెలలోనే నిగ్గు తేలినా చర్యలపై అధికార యంత్రాంగం తాత్సారం చేస్తోందని విమర్శలు నెలకొన్నాయి. కొంత మంది రెవెన్యూ అధికారులకు మాత్రం నోటీసులు ఇచ్చి వదిలేశారు.

ప్రయోగాత్మకంగా టీటీఈలకు బయోమెట్రిక్


బయోమెట్రిక్ హాజరు వేస్తున్న టీటీఈ

గుంతకల్లు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో పైలెట్ ప్రోగ్రామ్‌గా చేపట్టిన టికెట్ చెకింగ్ ఎగ్జామినర్ల (టీటీఈ) బయోమెట్రిక్ సైనిన్, సైనాఫ్ సిస్టంను గుంతకల్లు డివిజనల్ కేంద్రంలో ప్రారంభించారు. గతంలో టీటీఈల హాజరు, విధుల నుంచి వైదొలగే కార్యక్రమం మాన్యువల్ ప్రక్రియగా ఉండేది. టికెట్ చెకింగ్ విధానంలో ఖచ్చితత్వం కోసం రైల్వే బోర్డు ద.మ. రైల్వే జోన్‌లో ప్రయోగాత్మకంగా బయోమెట్రిక్ సైన్ ఇన్, సైనాఫ్ పద్ధతిని ప్రవేశపెట్టింది. ఈ మేరకు ఆదివారం టీటీఈలు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర, ఫేస్ ఐడెంటిటీ, ఐరిస్, వాయిస్ గుర్తింపుతో హాజరు నమోదు, విధుల నుంచి వైదొలగే ప్రక్రియకు నాంది పలికారు.

ఒంటరి ప్రయాణికురాలి భద్రతపై దృష్టి

రైళ్లల్లో ఒంటరిగా వెళ్లే ప్రయాణికురాళ్లపై టీటీఈల ద్వారా ప్రత్యేక దృష్టిని నిలిపి వారికి భద్రత కల్పించే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. గుంతకల్లు మీదుగా వెళ్లిన కోయంబత్తూరు-ముంబై (నం. 11014) ఎక్స్‌ప్రెస్‌లో టీటీఈల ద్వారా ఒంటరి ప్రయాణికురాళ్లను పలకరించి, వారి వివరాలను నమోదుచేసి, వారు గమ్యం చేరేంత వరకూ అందుబాటులో ఉంటామంటూ భరోసా కల్పించే కార్యక్రమాన్ని ఆరంభించారు.

తాడిపత్రిలో రాళ్ల యుద్ధం

● వినాయక విగ్రహాల ఊరేగింపులో ఉద్రిక్తత
● జేసీ వర్సెస్ కాకర్ల
● లారీ, డీజే వాహనాలు ధ్వంసం


వాగ్వాదం చేసుకుంటున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ్

తాడిపత్రి, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం వినాయక విగ్రహాల ఊరేగింపులో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీకే చెందిన కాకర్ల రంగనాథ్ వర్గీయులు రాళ్ల దాడి చేసుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి, ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రధాన అనుచరుల్లో కాకర్ల రంగనాథ్ ఒకరు. మనస్పర్థలతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. కాకర్ల, జేసీ వర్గీయులు ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జనానికి ఊరేగింపుగా బయల్దేరారు. వైఎస్ఆర్ సర్కిల్ వద్ద రంగనాథ్ వాహనాన్ని ఆపి, డ్యాన్సులు వేస్తున్నారు. వెనకే జేసీ ప్రభాకర్ రెడ్డి విగ్రహ వాహనం ఉంది. దీంతో ఆయన త్వరగా వెళ్లాలని రంగనాథ్ వాహనం వారికి సూచించారు. దీంతో వాగ్వాదం తలెత్తింది. అక్కడున్నవారు సర్దిచెప్పి పంపించారు. అనంతరం రామచంద్ర లాడ్జి సమీపంలోకి రాగానే కాకర్ల రంగనాథ్‌కు సంబంధించిన వినాయక విగ్రహం వద్ద డీజేలు పెట్టి, పాటలు పాడుతూ, డ్యాన్స్‌లు వేస్తున్నారు. ప్రభాకర్‌రెడ్డి తొందరగా వెళ్లాలంటూ మరోసారి రంగనాథ్‌తో వాగ్వాదానికి దిగారు. వారి వర్గీయులు వెనుకవైపు నుంచి కేకలు వేయడంతో ఘర్షణ మొదలైంది. పరస్పరం రాళ్ల రువ్వుకున్నారు. కట్టెలు తీసుకుని, రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇరువర్గాలను చెదరగొట్టారు. కాకర్ల రంగనాథ్‌కు సంబంధించి వినాయకుడి విగ్రహాన్ని తరలించే లారీ, డీజే బాక్సుల వాహన అద్దాలు పగులగొట్టారు. పోలీసులు వెంటనే వాహనాలను పక్కకు పెట్టించారు. ఇరువర్గాలకు సర్ది చెప్పి ఇళ్లకు పంపించారు. అంతటితో సద్దుమణిగింది. ఆ తరువాత వినాయకుడి విగ్రహాలను పోలీసు బందోబస్తు నడుమ నిమజ్జనానికి తరలించారు.


ధ్వంసమైన డీజే వాహన అద్దాలు


రాళ్లు రువ్వుకున్న దృశ్యం

ధైర్యంగా ప్రజల్లోకి వస్తున్నాం

● చూడలేని స్థితిలో వైసీపీ నాయకులు
● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
● పాపంపేటలో 'స్త్రీ శక్తి' విజయోత్సవ సభ


మహిళలకు మెగా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరులు

అనంతపురంరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి ధైర్యంగా ప్రజల్లోకి వస్తున్నామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పాపంపేటలో స్త్రీశక్తి పథకం విజయోత్సవ సభ నిర్వహించారు. ముందుగా పాపంపేట సర్కిల్ నుంచి జొన్నా ఐరన్ మార్టు వెనుక భాగంలో నిర్వహించిన సభా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళలు సూపర్ సిక్స్-సూపర్ హిట్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ మహిళను కదిలించినా సంతోషం కనిపిస్తోందని అన్నారు. బాలికల విద్యాభివృద్ధికి 2004లోనే సైకిళ్లను పంపిణీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్ అని చెప్పి, సూపర్ హిట్ చేసి చూపించామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా ఒకేసారి రూ.వెయ్యి పెంచి రూ.4వేలు పింఛన్ ఇస్తున్నామని అన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికి తల్లికి వందనం ఇచ్చామన్నారు. అన్నదాత సుఖీభవ మొదటి విడతగా రూ.7వేలు, దీపం పథకం కింద ఉచితంగా మూడు సిలిండర్లు, మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలు తమ ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో చంద్రబాబు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. మహిళలకు విరివిగా రుణాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇన్ని మంచి పనులు చేస్తుంటే సైకో జగన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు ఇష్టమొచ్చినట్టు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి నిత్యం ప్రభుత్వంపై విషప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. అనంతరం మండలంలోని డ్వాక్రా మహిళలకు రుణాలకు సంబంధించి రూ.23 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలతో కలిసి ఎమ్మెల్యే ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. అనంతపురం నుంచి కళ్యాణదుర్గం మార్గంలోని కురుగుంట వరకు మహిళలతో మాట్లాడుతూ జీరో ఫేర్ టికెట్ తీసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అంతర్ జిల్లా బదిలీలపై కసరత్తు

● జిల్లా నుంచి 53 మంది టీచర్ల దరఖాస్తు
● ఇతర జిల్లాల నుంచి వచ్చేందుకు 52 మంది..


దరఖాస్తులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి

అనంతపురం విద్య, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలపై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అంతర్ జిల్లా టీచర్ల బదిలీలకు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఇతర జిల్లాలకు వెళ్లే టీచర్లు స్పౌజ్, మ్యూచువల్‌పై బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. అనంత ఉమ్మడి జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లేందుకు 53 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో గ్రేడ్-2 హెచ్‌ఎంలు నలుగురు, పీఎస్ హెచ్‌ఎం ఒకరు ఉండగా.. స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 19 మంది, ఎస్జీటీ కేడర్‌లో 29 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో జడ్పీ యాజమాన్యం పరిధిలో 45 మంది, మున్సిపల్ పరిధిలో ఐదుగురు, గవర్నమెంట్ పరిధిలో ముగ్గురు టీచర్లు ఉన్నారు. ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి జిల్లాకు రావడానికి 52 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో గ్రేడ్-2 హెచ్‌ఎంలు నలుగురు, పీఎస్ హెచ్‌ఎం ఒకరు ఉండగా.. స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 17 మంది, ఎస్జీటీ కేడర్‌లో 30 మంది ఇతర జిల్లాల నుంచి అనంత జిల్లాకు రావడానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో స్పౌజ్ కేటగిరి కింద 37 మంది, మ్యూచువల్ కింద 15 మంది ఉన్నారు.

● **డీఎస్సీ నియామకాలలోపే..**

డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలకు వేగంగా అడుగులు పడుతున్నాయి. అంతర్ జిల్లా టీచర్ల బదిలీలు ఈ డీఎస్సీ నియామకాలలోపే చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో జిల్లాకు వచ్చిన అంతర్ జిల్లా బదిలీ టీచర్ల దరఖాస్తులను వెంటనే రాష్ట్రశాఖకు పంపాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం దరఖాస్తులను అనంత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలించింది. జిల్లా నుంచి ఏఏ సబ్జెక్టు టీచర్లు ఎంతమంది ఇతర జిల్లాలకు వెళుతున్నారు.. ఇతర జిల్లాలకు చెందిన ఏఏ సబ్జెక్టు టీచర్లు రావడానికి ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారో లెక్కతేల్చారు. వాటి ఆధారంగా జిల్లాలో ఆయా టీచర్లకు ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయా.. లేదా అని కూడా నివేదికలు రూపొందించి ఆదివారం రాత్రి రాష్ట్ర శాఖకు పంపించారు. వీటిని రాష్ట్ర శాఖ పరిశీలించి నిబంధనల మేరకు ఉన్నవారికి ఈ వారంలోపే అంతరజిల్లా బదిలీల ఆర్డర్లు విడుదలచేసే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు అంటున్నారు.

అవినీతి డంపింగ్..!

(3వ పేజీ తరువాయి)

ప్రారంభం కావడంతో కుంభకోణంలో భాగస్వాములైన ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు ఆందోళనలో పడ్డారు.

గతంలో పనిచేసిన ఆడిటర్లే కీలకం

డంపింగ్ యార్డులో బయోమైనింగ్ పేరుతో వైసీపీ ప్రభుత్వంలో బిల్లులను ఎగ్జామినర్లు (ఆడిటర్లు) కళ్లు మూసుకుని పాసు చేశారనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఎగ్జామినర్లుగా పనిచేసిన ఇందిరారెడ్డి ప్రస్తుత స్టేట్ ఆడిట్‌లో జిల్లా అధికారిగా, వెంకటరమణ ప్రస్తుతం తిరుపతిలో ఆడిట్‌శాఖలో, గోవిందప్ప ప్రస్తుతం కర్నూలు ఆర్‌డీగా పనిచేస్తున్నారు. ఈ ముగ్గురు ఎగ్జామినర్లే డంపింగ్ యార్డు బిల్లులు చేయడంలో కీలకంగా వ్యవహరించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే బిల్లులు మంజూరు చేశారని తెలుస్తోంది. మొదట రూ.1.8 కోట్లు, తరువాత రూ.6కోట్లు, ఆ తరువాత రూ.4కోట్లు బిల్లులు చేశారు. అదే క్రమంలో మరో రూ.2కోట్లు బిల్లులకు ప్రతిపాదనలు రాగా ఎగ్జామినర్లు మారడంతో తిరస్కరించారు.

డీఈని కాపాడడానికి పాట్లు

వైసీపీ ప్రభుత్వ హయాంలో డంపింగ్‌యార్డులో అక్రమాలకు కీలకంగా వ్యవహరించిన అప్పటి ఓ డీఈని కాపాడేందుకు ప్రస్తుతం పనిచేస్తున్న డీఈ పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీకావు. 2019-24 మధ్య అక్రమాలకు పాల్పడిన డీఈపై కూటమి ప్రభుత్వం రావడంతో బదిలీ వేటు వేసింది. ఏఎంసీ నుంచి ఆ డీఈని గుత్తికి బదిలీ చేయగా...అక్కడ కమిషనర్ విధుల్లోకి చేర్చుకోలేదు. దీంతో అక్కడి నుంచి తిరిగి ధర్మవరానికి సాగనంపారు. ఆ ఇంజనీరును కాపాడేందుకు ఆయన స్థానంలో కడప జిల్లా నుంచి అప్పటి వైసీపీ నేతల సిఫారసులతో ఏఎంసీకి బదిలీపై వచ్చిన వైసీపీ అభిమానిగా ఉన్న ఇంజనీరు.. అప్పట్లో ఏమీ జరగలేదని...గతంలో పనిచేసిన ఇంజనీరుకు ఎలాంటి సంబంధం లేదంటూ నివేదిక ఇవ్వడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. డీఈ రాసిన నివేదికను ఎగ్జామినర్లు, కమిషనరు తిరస్కరించి ఘాటుగా హెచ్చరించినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చినా నగరపాలక సంస్థలో ఇప్పటికీ వైసీపీ అభిమానులే రాజ్యమేలుతున్నారనడానికి ఇదొక నిదర్శనంగా నిలుస్తోంది.

విజిలెన్స్ విచారణ జరుగుతోంది



డంపింగ్ యార్డులో బయోమైనింగ్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతున్న మాట వాస్తవమే. అప్పట్లో ఎంత మేర పనిజరిగింది...ఎంత నిధులు ఖర్చు చేశారనే అంశాలన్నీ విజిలెన్స్ విచారణలో తేలుస్తారు. ఇందులో నిజానిజాలు తేలాక ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతున్న విజిలెన్స్ విచారణకు అన్ని రకాలుగా సహకరిస్తున్నాం. ఇంజనీర్ల వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు సంబంధించిన రికార్డులన్నీ ఇవ్వాలని సూచించాం. అంతర్గతంగా జరుగుతున్న విజిలెన్స్ విచారణకు సంబంధించిన వివరాలను రహస్యంగానే ఉంచాలి. విచారణ అనంతరం విజిలెన్స్ అధికారులే ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు.

-బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్

కూలి బతుకుల్లో కన్నీళ్లు..

● కూలీల ఆటోను ఢీకొన్న వ్యాన్ ● ఇద్దరు మృతి
● డ్రైవర్ సహా 12 మందికి గాయాలు


మల్లెల లక్ష్మీదేవి, లక్ష్మీనరసమ్మ(ఫైల్)

కొత్తచెరువు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పరాయి ఊరికి పని కోసం బయల్దేరిన కూలీల కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం కన్నీళ్లు నింపింది. మలుపులో మృత్యువు వ్యాన్ రూపంలో దూసుకొచ్చింది. ప్రాణాలు తీసి, కుటుంబాల్లో చీకట్లు నింపింది. మండలంలోని మైలసముద్రం గ్రామ సమీపాన ఆదివారం ఉదయం కూలీల ఆటోను వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మరణించగా.. 12 మంది గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లికి చెందిన 13 మంది మహిళా కూలీలు అదే ఊరికి చెందిన గోపాల్ ఆటోలో చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లికి కూలి పనుల కోసం బయలుదేరారు. మైలసముద్రం గ్రామ సమీపంలోని మలుపు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. ప్రమాదంలో ఒలిపి లక్ష్మీనరసమ్మ(70) అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన రాజేశ్వరి, లక్ష్మమ్మ, మల్లెల లక్ష్మీదేవి, చిన్నాగమ్మ, వెంకటనారాయణమ్మను 108 వాహనంలో కొత్తచెరువు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో ముగ్గురు గంగమ్మ, రమాదేవి, ఆటో డ్రైవర్ గోపాల్‌ను పుట్టపర్తిలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. మల్లెల లక్ష్మీదేవి(50) కొత్తచెరువు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. చిన్నాగమ్మ, వెంకటలక్ష్మమ్మ, లక్ష్మమ్మను మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఒలిపి లక్ష్మీనరసమ్మకు కుమారుడు ఓబిరెడ్డి ఆలియాస్ చంద్రాయుడు ఉన్నాడు. అతడు మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మల్లెల లక్ష్మీదేవికి భర్త ఈశ్వరప్ప, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొత్తచెరువు సీఐ మారుతీశంకర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు, బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. ఒలిపి లక్ష్మీనరసమ్మ, మల్లెల లక్ష్మీదేవి మృతదేహాలను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


దెబ్బతిన్న ఆటో

డాక్టర్లపై దాడికి యత్నం

మల్లెల లక్ష్మీదేవి కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు ఆమెను చూడటానికి పెద్దఎత్తున ఆస్పత్రికి వచ్చారు. దీంతో అక్కడున్న రోగులకు ఇబ్బంది కలుగుతుందని వైద్యులు, సిబ్బంది తెలిపారు. మృతిచెందితే చూడటానికి వస్తే.. ఆంక్షలు విధిస్తారా అంటూ డాక్టర్‌పై దాడికి యత్నించారు. పోలీసులు రంగప్రవేశం చేసి, వారిని అక్కడి నుంచి పంపించేశారు. బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రాణం తీసిన నిర్లక్ష్యం

● డివైడర్‌ను ఢీకొన్న కారు ● వ్యక్తి దుర్మరణం


అంజినకుమార్ (ఫైల్)

పెనుకొండ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలికొంది. రహదారి పక్కనే ఉన్న ఇనుప డివైడర్ ప్రమాదకరంగా మొన తేలి ఉన్నా.. పట్టించుకోలేదు. మరమ్మతులు చేయలేదు. ఆ డివైడర్‌ను కారు ఢీకొనడంతో అందులోకి చొచ్చుకొచ్చి వ్యక్తి దుర్మరణం చెందాడు. మండలంలోని గుట్టూరు గ్రామ సమీపాన 44వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం ఇనుప డివైడర్‌ను కారు ఢీకొని గొల్ల అంజినకుమార్ (34) అక్కడికక్కడే మృతిచెందారు. కియ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరానికి చెందిన గొల్ల అంజినకుమార్ కారులో పనినిమిత్తం బెంగళూరుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గుట్టూరు సమీపంలోకి రాగానే ఇనుప డివైడర్‌ను కారు ఢీకొంది. ఇనుప చువ్వ లోపలికి చొచ్చుకురావడంతో అద్దాలు పగిలి, ఆ ముక్కలు అంజినకుమార్ దేహంలోకి చొచ్చుకెళ్లాయి. దీంతో తీవ్ర రక్తస్రావమై, అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. అంజినకుమార్‌కు భార్య రాజేశ్వరి, కుమారుడు ఉన్నారు. అతడి తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ముందే హెచ్చరించిన ఆంధ్రజ్యోతి

కియ కార్ల కంపెనీ సమీపాన జాతీయరహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో పెనుకొండ నుంచి గుట్టూరు వరకు జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన ఇనుప డివైడర్ రోడ్డుపైకి వచ్చింది. దీంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నా హైవే అధికారులు పట్టించుకోవడంలేదని ఈ ఏడాది జూన్ 14న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. హైవే అధికారులు పట్టించుకోకపోవడంతో ఆదివారం ప్రమాదంలో అంజినకుమార్ బలైపోయాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఇనుప డివైడర్లకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


కారులోకి చొచ్చుకొచ్చిన ఇనుప డివైడర్

టమోటా కిలో రూ.25

అనంతపురంరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.14, సరాసరి ధర రూ.19తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3వేల టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

గంగమ్మ ఒడికి.. గణపయ్య

● కోలాహలంగా వినాయకుడి విగ్రహాల నిమజ్జనం

(న్యూస్‌నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా గత బుధవారం కొలువుదీరిన వినాయక విగ్రహాలు ఐదురోజుల పూజల అనంతరం ఆదివారం నిమజ్జనానికి తరలాయి. అనంతపురం అర్బన్‌తో పాటు శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో నిమజ్జనానికి తరలించారు. ఉదయమే మండపాల వద్ద నిర్వాహకులు అర్చకుల చేత ప్రత్యేక పూజలు జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం సాయంత్రం విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఊరేగించారు. పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ, బాణసంచా కాల్చుతూ.. గణపతిబొప్పా మోరియా అంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం విగ్రహాలను సమీపంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలలో పోలీసుల బందోబస్తు నడుమ నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో వినాయకుడి ప్రసాదమైన లడ్డూలకు వేలంపాటలు నిర్వహించగా.. పలువురు భక్తులు పోటీపడి దక్కించుకున్నారు. అనంతపురం నగరంలో జరిగిన శోభాయాత్రలో జోరువర్షంలోనూ పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. కళాకారులు పాటలు పాడుతూ.. కోలాటం వేస్తూ అలరించారు.


అనంతపురం నగరంలో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న వినాయక విగ్రహం


శోభాయాత్రలో సప్తగిరి సర్కిల్ వినాయకుడు


సప్తగిరి సర్కిల్ వినాయకుడి లడ్డూను వేలంపాటలో దక్కించుకున్న అమర్నాథ్‌నాయుడు


సప్తగిరి సర్కిల్లో కోలాటం వేస్తున్న ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్య బృందం


జోరు వానలోనూ వినాయకుడి శోభాయాత్రను తిలకించడానికి వచ్చిన నగర ప్రజలు


శోభాయాత్రలో యువకుల చిందులు


చంద్రబాబుకొట్టాలలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


రజకనగర్‌లో..


నార్పలలో..


అనంతపురం నగరంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న మహిళలు



యువతులు, చిన్నారుల చిందులు..



కొడిమి వంక వద్ద విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

పశువుల సంత ఆదాయం రూ.3.20 లక్షలు

అనంతపురంరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో రెండురోజుల పాటు జరిగిన పశువులసంతతో రూ. 3,20,890 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకలసంత ద్వారా రూ.1,96,690లు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంత ద్వారా రూ. 1,24,200ల ఆదాయం మార్కెట్‌కు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సీనియర్ టెన్నికాయిట్ క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో ఉమ్మడి జిల్లా సీనియర్ టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి రంగస్వామి ప్రకటించారు. పురుషుల విభాగంలో చెనీత్‌రాజ్, పురుషోత్తం, వరుణ్‌సందేష్, యశ్వంత్ సాయిబాలజీ, సుధీర్ ఎంపికయ్యారు. మహిళల విభాగంలో సుప్రియ, షర్మిలా, శరణ్య, వర్షిత, అర్చన ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 13వ తేదీన బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కోశాధికారి వలీ, పీడీలు అమరాంజనేయులు, జెబీవుల్లా, ప్రభాకర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బుర పరచిన కార్ రేస్

● కొండ ప్రాంతంలో సందడి ●ముగిసిన పోటీలు


కార్ రేస్‌ను మొబైల్‌లో బంధిస్తున్న యువత

శింగనమల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక మరవకొమ్మ వద్ద శివపురం కొండ ప్రాంతంలో ఆదివారం రయ్ రయ్ అంటూ కార్లు, బైక్ లు చేసిన సందడి జనాన్ని అబ్బురపరిచింది. కొండ ప్రాంతాల్లో కార్లు, బైక్ రేస్ నిర్వహించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. శింగనమల మరవకొమ్మ క్రాస్ దగ్గర ఉన్న శివపురం గాలిమరల కొండ ప్రాంతంలో చివరి రోజున 'దక్షిణి డేర్ క్రాస్ కంట్రీ ర్యాలీ అండ్ బైక్ రేస్' పేరిట ఈ పోటీలను శింగనమల మండలంలోని మరవకొమ్మ క్రాస్ కొండ ప్రాంతం నుంచి బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు కొండ పాంతం వరకు 6 కిలో మీటర్లు కొండలోనే కార్, బైక్ రేస్‌ను నిర్వహించారు. ఈ రేస్‌లకు ఏపీ, తెలంగాణ, గోవా, తమిళనాడు, కేరళ, కర్ణాటక ఇతర రాష్ట్రాల రేసర్లు పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ పోటీలను నిర్వహించేందుకు కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ అనుమతి ఇచ్చారు. కార్లు, బైక్ రేస్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు.

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

నియోజకవర్గంలో రేసులు నిర్వహించడం తమ ఉద్దేశ్యం కాదని, మానకొండ ప్రాంతంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. నార్పల, శింగనమల, పుట్లూరు మండలాల్లో గత నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న పోటీలకు కలెక్టర్, ఎస్పీ అనుమతులు ఇచ్చారని, దీనిని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మోటర్ స్పోర్ట్స్ సంస్థ నిర్వహించిందని తెలిపారు. తమ ఉద్దేశ్యం రేసులను ప్రోత్సహించడం కాదని, పర్యాటక పరంగా, సాంస్కృతిక, క్రీడా రంగాలలో కొత్త అవకాశాలను సృష్టించే దిశగా మాత్రమే ఈవెంట్ జరిగిదన్నారు. .


బైక్ రేస్‌కు సిద్ధమవుతున్న రైడర్లు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకఅలంకరణలో సుబ్రమ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే స్వామివారి మూలవిరాట్‌కు పాలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు జరిపారు. తర్వాత నైవేద్యం సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. భక్త లు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి దర్శనం చేసుకుని మొ క్కులు తీర్చుకున్నారు. అన్నదానకమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు, ప్రధాన అర్చకుడు రాముస్వామి, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ శింగనమల మండల అధ్యక్షుడి ఎంపిక

అనంతపురం విద్య, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ శింగనమల మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులు నియమితులయ్యారు. జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయభవన్‌లో ఆదివారం ఆ మండల ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో ఎన్నికల అధికారులుగా వెంకటరమణ, అంజలీదేవి వ్యవహరించి మండలనూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా రామమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయలవెంకటేష్, సిరాజుద్దీన్, సీనియర్ నాయకులు నరసింహులు, వన్నప్ప, సూర్యనారాయణ, ఆనంద్ తదితరులు సత్కరించి అభినందించారు.

హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర కోశాధికారిగా భాస్కరరెడ్డి



అనంతపురం విద్య, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా అనంత జిల్లాకు చెందిన భాస్కరరెడ్డి నియమితులయ్యారు. ఆదివారం విజయవాడలోని లయోలా కాలేజ్‌లో హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా అనంత జిల్లాలోని ఉరవకొండ మండలం బూదిగవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న భాస్కరరెడ్డిని రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని జిల్లా అధ్యక్షుడు జయరామిరెడ్డి తెలిపారు. రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవి రావడం పట్ల జయరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ అభిందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రాధాష్టమి


ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాధాష్టమిని పురస్కరించుకుని ఆదివారం హెచ్చెల్సీ కాలనీ కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయం వద్ద ఇస్కాన్ ఆధ్వర్యంలో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి పురవీధులగుండా శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తిని రథంలో ఊరేగించారు. ఊరేగింపు ముందు భక్తులు హరే కృష్ణ.. హరే రామ భజనలు చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేవనూరు సుందరం విజయ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సొసైటీ అధ్యక్షుడు


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న సొసైటీ చైర్మన్ తదితరులు

అనంతపురం క్రైం/ ఆత్మకూరు, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆత్మకూరు మండలం పీ.యాలేరు ప్రాథమిక వ్యవసాయపరపతి సంఘం చైర్మన్ కృష్ణమోహన్, డైరెక్టర్లు మదిగుబ్బ బొమ్మయ్య, సిద్ధరాంపురం కురుబ నారాయణప్ప కలిశారు. అనంతపురం నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం వారు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రాప్తాడు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామినేపల్లి జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. రాప్తాడు మండలకేంద్రానికి చెందిన గంజి చిట్టెప్ప కుమారుడు గంజి రమేష్ పని నిమిత్తం బైక్‌పై రామినేపల్లికి బయలుదేరాడు. గ్రామ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గంజి రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి

● పెట్టుబడి తక్కువ.. దిగుబడి అధికం
● ఖరీఫ్‌లో అధికంగా సాగు చేశామంటున్న అన్నదాతలు


జూలాకాల్వ గ్రామం వద్ద ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట

శింగనమల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఖరీఫ్ సీజన్‌లో మండలవ్యాప్తంగా విరివిగా వరి పంట సాగు చేసే రైతన్నలు ఈసారి మొక్కజొన్న సాగుపై ఆసక్తి కనబరిచారు. వరిసాగుకు ఖర్చులు భారం కావడంతోనే మొక్కజొన్న సాగు చేసినట్లు రైతులు చెబుతున్నారు. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలు కాగానే రైతులు బీపీటీ, సోనామసూరి రకం వరి పైర్లు సిద్ధం చేసేవారు. ఇందుకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చువుతోంది. కాగా మార్కెట్‌లో బీపీటీ, సోనామసూరి రకాల బియ్యం క్వింటాల్ రూ.4వేల నుంచి రూ.4200 చొప్పున మాత్రమే ధరలు పలుకుతుండడంతో పెట్టిన పెట్టుబడి కూడా అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా ఈ సారి మొక్కజొన్న సాగువైపు ఆసక్తి చూపినట్లు చెబుతున్నారు. కొన్నేళ్లుగా మొక్కజొన్న క్వింటాల్ ధర రూ.2,200 పలకగా ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నాయని, పైగా పెట్టుబడి కూడా చాలా తక్కువ అని, కనుక ఆ పంటను సాగు చేసినట్లు పేర్కొంటున్నారు. ఈ ఖరీఫ్‌లో మండలంలో 1000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. దిగుబడులు బాగా వస్తాయనే రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏఓ అన్వేష్ మాట్లాడుతూ మండలంలో గతం కంటే మొక్కజొన్న పంట సాగు విస్తీరణ ఈ సారి పెరిగిందన్నారు.

నేడు గుమ్మేపల్లికి ఎమ్మెల్యే రాక

శింగనమల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మేపల్లి గ్రామానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. గ్రామంలో చేపట్టే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొననున్నట్లు చెప్పారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు తప్పక హాజరు కావాలని కోరారు.

యువత సరైన మార్గాలను ఎంచుకోవాలి


ఖో-ఖో మ్యాచ్

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): యువత సరైన మార్గాలను ఎంచుకుని ముందుకు సాగాలని టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛందసంస్థ చైర్‌పర్సన్ మేరీవటమట్టం సూచించారు. మండలకేంద్రంలోని చిల్డ్రన్స్ సెంటర్ ఆవరణలో ఆదివారం టింబక్టు కలెక్టివ్, చిగురు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతీయువకులకు, పాఠశాలల విద్యార్థులకు ఆటల పండుగను నిర్వహించారు. తొలుత మేరీ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో యువత సరైన మార్గాలను ఎంచుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. అనంతరం ఖోఖో, వాలీబాల్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ తదితర క్రీడాపోటీలను నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. కో ఆర్డినేటర్ రామన్న , పూర్ణిమ, యామిని, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

బాత్‌రూంలో జారి పడి అర్చకుడి మృతి


సతీష్‌కుమార్(ఫైల్)

కనగానపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తగరకుంట గ్రామంలో ఆదివారం సతీష్‌కుమార్(45) అనే అర్చకుడు బాత్‌రూంలో ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందారు. తగరకుంటకు చెందిన సతీష్‌కుమార్ రాప్తాడు మండలం పాలచర్ల రామాలయంలో అర్చకుడిగా పని చేస్తున్నారు. కాగా ఆయన ఆదివారం ఉదయం తన ఇంటిలో ఉన్న బాత్‌రూంలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ కాలుజారి పడ్డాడు. తలకు బలమైన గాయం అవడంతో కుటుంబసభ్యులు వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య చైత్రతో పాటు ఒక కుమారుడు ఉన్నారు.

ప్రధాని మన్ కీ బాత్‌లో బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీబాత్‌ను బీజేపీ నాయకులు శ్రద్ధగా వీక్షించారు. ఆదివారం ఢిల్లీ నుంచి ప్రత్యక్ష ప్రసారమైన మన్‌కీ బాత్ ప్రోగ్రాంను వీక్షించేందుకు నగరంలోని రెవెన్యూ కాలనీలో గల బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బోనాల మారుతీ గోవింద ప్రసాద్ నివాసంలో ఏర్పాట్లు చేశారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, స్టేట్ ఆల్ సెల్స్ కన్వీనర్ క నంపల్లి చిరంజీవిరెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఓలేటి రత్నమయ్య, మండలం అధ్యక్షుడు సాకే చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగ రాజు, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహ్మద్‌రఫీ, నాయకులు పవన్‌దర్శన్, ఆనంద్ తదితరులు పాల్గొని ప్రధాని మన్‌కీ బాత్ ప్రోగ్రాను వీక్షించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

రామగిరి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):మండలంలోని పేరూరు డ్యాం పరిధిలో ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి వెళ్లడంతో సమస్య పరిష్కరించాలని ఆమె టీడీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, అప్పర్‌పెన్నార్ డ్యాం సాగునీటి సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణను ఆదేశించారు. దీంతో ఆదివారం వారు ఆ ప్రాంతంలో బోరు వేయించారు. నీరు సమృద్ధిగా పడ్డాయి. దీంతో ఇక ఇక్కడి ప్రజలకు ఇబ్బందులు తొలగినట్టేనని, వీలైనంత త్వరగా పైపులైన్ ఏర్పాటుచేసి తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు.

ఆ ఆలయానికి జేఏనే దిక్కు

- దీర్ఘకాలిక సెలవులో పెన్నహోబిలం ఈఓ
- వేలం నిర్వహణ వాయిదా
- ఆలయ ఆదాయానికి గండి





మూసివున్న కార్యనిర్వహణాధికారి కార్యాలయం, ఖాళీగా ఉన్న కుర్చీ

ఉరవకొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జూనియర్ అసిస్టెంటే దిక్కు అయ్యారు. ఆలయ ఈఓ రమేష్ బాబు గత నెల 28వ తేదీ నుంచి రెండు నెలలపాటు వ్యక్తిగత కారణాలతో సెలవు కోరుతూ దేవాదాయ కమిషనర్, ఆర్జేసీ, జిల్లా ఏసీకు లేఖలు పంపారు. గత ఏడాది సెప్టెంబరు 27న ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఏడాది పూర్తి కాకుండానే ఆయన దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం చర్చాంశనీయంగా మారింది. ఉన్నతాధికారుల ఒత్తిళ్లు.. రాజకీయ కారణాలే కారణమా.. అన్న చర్చ నడుస్తోంది. గతంలో హుండీ లెక్కింపు సమయంలో నగల మూట మాయం అయినపుడే వేటు పడుతుందన్న చర్చ సాగింది. అప్పట్లో అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల సిఫార్సులతో ఆగిపోయింది. కాగా ప్రస్తుతం కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో కార్యనిర్వహణాధికారి కార్యాలయాన్ని కూడా తెరిచేవారు కరువయ్యారు. దీంతో పాలన కుంటు పడుతోంది. ఇక్కడ పనిచేస్తున్న పలువురు సిబ్బందిని డిప్యూటేషన్‌పై పంపారు. కేవలం ఈఓ, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే ఉండగా.. అందులో ఈఓ సెలవులో వెళ్లడంతో ఇక జూనియర్ అసిస్టెంట్ మాత్రమే మిగిలారు. గతంలో ఆలయంలో ముగ్గురు జూనియర్ అసిస్టెంట్‌లు, ఇద్దరు అటెండర్లు ఉండేవారు. వారిలో ఒక జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌ను పెద్దపప్పూరు, అశ్వర్థం ఆలయానికి డిప్యూటేషన్ వేశారు. మరో జూనియర్ అసిస్టెంట్‌ను గూగూడుకు, ఇంకో అటెండర్ డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో ఆలయంలో పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, డిప్యూటేషన్‌పై వెళ్లిన సిబ్బందిని వెనక్కు రప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మూడుసార్లు వాయిదా

ఆలయానికి ఆదాయాన్ని ఇచ్చే వేలాలు ఇప్పటికే మూడు సార్లు వాయిదా పడ్డాయి. గత నెల 29న వేలం పాట నిర్వహించాల్సి ఉండగా, ఈఓ సెలవుపై వెళ్లడంతో తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారో అన్నది స్పష్టత కరువైంది. తలనీలాలు, పాత్ర సామాన్లు, కలగలపు బియ్యానికి వేలం నిర్వహించాల్సి ఉంది. వీటిలో తలనీలాల ద్వారానే ఆలయానికి ఆదాయం ఎక్కువ వస్తూ ఉంటుంది. పెన్నహోబిలానికి ఈఓలుగా వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారన్న చర్చ నడుస్తోంది. ఆలయంలో ఇటీవల అవినీతి ఆరోపణలు బయటకు రావడంతోనే ఇక్కడికి ఈఓగా వచ్చేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. ఉన్నతాధికారులు లేకపోవడంతో కిందస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నూతన రథం నిర్మాణం కూడా ఆగి పోయింది. ఈ విషయంపై దేవదాయ శాఖ అధికారి తిరుమల రెడ్డిని వివరణ కోరగా.. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

క్రైం న్యూస్

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

కళ్యాణదుర్గంరూరల్/శెట్టూరు/తాడిపత్రి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకోగా.. మరో ఇద్దరి ఆత్మహత్యలకు కారణాలు తెలియాల్సి ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి..



శ్రీకాంత్ (ఫైల్)

● కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని రెవెన్యూ కాలనీకి చెందిన మఠం శ్రీకాంత్ (52) ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకాంత్ కోళ్లఫారం, చిట్టీలు నిర్వహించేవాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. ఆదివారం అతని భార్య, పిల్లలు మొదటి అంతస్తులో ఉండగా... కింద గదిలో లుంగీతో ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తరువాత భార్య ఫోన్ చేసినా.. లిఫ్ట్ చేయకపోవడంతో కిందకు వచ్చి చూడగా అప్పటికే అతను మరణించి ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీకాంత్‌కు భార్య సుష్మ కొడుకు స్కంద, కూతురు యశశ్విని ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



నరేంద్ర (ఫైల్)

● శెట్టూరు: మండలంలోని అనుంపల్లి గ్రామానికి చెందిన బోయ బొమ్మలింగప్ప కుమారుడు.. బోయ అశోక్ అలియాస్ నరేంద్ర (27) ఉరేసుకొని.. ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. అనుంపల్లిలో చాకలి వీరభద్రప్ప పొలంలో వున్న ముళ్లకంప చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

● తాడిపత్రి: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి నవీన్‌కుమార్ (19) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలూరుకు చెందిన రమాదేవి, సుబ్బయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వినయ్. ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. రెండో కుమారుడు నవీన్ కుమార్ ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. తండ్రి కొంతకాలం క్రితమే చనిపోయాడు. తల్లి రమాదేవి కూలిపనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. ఈ నేపథ్యంలో నవీన్‌కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రూరల్ పోలీసులు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉందని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నరసింహులు (ఫైల్)

శెట్టూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకూరు గ్రామానికి చెందిన గొల్ల నరసింహులు (54) గత నెల 28న విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే బంధువులు అతన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కోలుకోలేక ఆయన ఆదివారం మరణించాడు. నరసింహులుకు భార్య మల్లక్క ఉంది.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కణేకల్లు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగలాపురం వద్ద పొలాల్లోని ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం రాత్రి దుండగులు పగులగొట్టి అందులోని కాపర్‌వైరును చోరీ చేశారు. రైతు కవిత, నరసింహులు మరో నలుగురికి కలిపి తమ పొలాలకు నీటిని సరఫరా చేసుకునేందుకు బోర్ల కొరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కాగా దుండగులు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కాపర్‌వైరును చోరీ చేసుకుని వెళ్లడంతో ఆ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై వారు పోలీసులతో పాటు స్థానిక విద్యుత్ అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు

యల్లనూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సానే నాగేంద్రకు చెందిన సుమారు రూ.15 లక్షలు విలువజేసే అరటికాయలను నార్పల మండలానికి చెందిన వెన్నపూస వెంకటరామిరెడ్డి 2024 ఫిబ్రవరిలో వ్యాపార నిమిత్తం తీసుకువెళ్లాడు. అందులో రూ.9 లక్షల రూపాయలను చెల్లించి మిగిలిన మొత్తాన్ని ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడు. దీనిపై సానే నాగేంద్ర ఫిర్యాదు మేరకు వెన్నపూస వెంకటరామిరెడ్డిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి



సమావేశంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

ఉరవకొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లకు ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన హామీ మేరకు బకాయి పడ్డ నాలుగు నెలల డీఏలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి కోరారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పీఆర్సీ కమీషన్‌ను వెంటనే నియమించాలని, పీఆర్సీ ఆలస్యం అయితే 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని అన్నారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకున్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలన్నారు. జూన్‌లో జరిగిన బదీలలో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి కొత్తగా డీఎస్సీ ద్వారా ఎన్నికైన ఉపాధ్యాయులకు పాఠశాలలు కేటాయించి, రిలీవ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు ఓబన్న, శ్రీనివాసులు, నారాయణ స్వామి, ధనుంజయ, నజీర్ అహ్మద్, వెంకటేష్‌లు, చంద్రశేఖర్, మునిస్వామి, రఘురాములు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌కు తగ్గిన ఇన్ ఫ్లో



లింక్ చానల్ నుంచి రిజర్వాయర్‌లోకి వస్తున్న నీరు

కూడేరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి, తుంగభద్ర రిజర్వాయర్ నుంచి పెన్నోహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్‌డ్యాం)కు వస్తున్న నీరు రోజురోజుకు తగ్గిపోతుంది. ప్రస్తుతం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 152 క్యూసెక్కులతో పాటు లింక్ చానల్ నుంచి 98 క్యూసెక్కుల నీరు మాత్రమే పీఏబీఆర్‌లోకి వస్తోంది. దీంతో డ్యాంలో నీటి మట్టం 434.150 మీటర్లకు చేరుకుందని, నీటి నిల్వ 4.482 టిఎంసీలు ఉందని ఇరిగేషన్ ఏఈ లక్ష్మీదేవి తెలిపారు.

● బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 1,980 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 1,940 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.708 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

'వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు మానాలి'



మాట్లాడుతున్న కొండాపురం అనిల్ చౌదరి

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుపై వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడాన్ని మానుకోవాలని టీడీపీ తెలుగు యువత రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కొండాపురం అనిల్‌చౌదరి హెచ్చరించారు. స్థానిక ప్రజావేదికలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. అభివృద్ధే ధ్యేయంగా ప్రజాసంక్షేమం కొరకు నిరంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాటుపడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఇసుక, మట్టి అక్రమాలు, అక్రమ మద్యం, కంకర అమ్మడం, కబ్జాలే అభివృద్ధి అని మండిపడ్డారు. నియోజకవర్గంలో అనేక పాఠశాలలకు డెస్కులు, పాఠశాల భవనాల నిర్మాణాలకు సొంత నిధులు కేటాయించిన ఘనత ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు దక్కిందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ. 27 కోట్లతో సీసీ రోడ్లు, రూ. 4 కోట్లతో బీటీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు ఎమ్మెల్యే అమిలినేని చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ధనుంజయ, శివన్న, టీఆర్ తిప్పేస్వామి, సింగిల్ విండో అధ్యక్షులు మల్లిపల్లి నారాయణ, గోళ్ల వాటర్ షెడ్ ఛైర్మన్ బుజ్జన్న, మార్కెట్ యార్డు డైరెక్టర్ ధను నాయక్, మాజీ జెడ్పీటీసీ గురుప్రసాద్, మురళి, ఉరాల కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

గుత్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏ ఇస్లామీయా సూఫ్రావార్డీయా ఆధ్వర్యంలో ఆదివారం మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై ముస్లిం విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పరీక్షలకు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈనెల 5న మిలాదునబీ జన్మదినం పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో సీనియర్, జూనియర్ విభాగాల్లో మూడు బహుమతులు, పది కన్సలేషన్ బహుమతులను అందజేస్తున్నట్లు నిర్వాహకులు అన్వర్‌బాషా తెలిపారు. ఇందులో అబ్దుల్‌హేసేన్, షేక్ చాంద్‌బాష, హాజరత్‌హుసన్, మహ్మద్‌గౌస్ పాల్గొన్నారు.



వ్యాసరచన పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

పిల్లర్లకే పరమితం

ఉప్పరహాళ్ ఆగిన చెత్తతో సంపద కేంద్ర నిర్మాణం



ఉప్పరహాళ్‌లో ఆగిన చెత్తతో సంపద కేంద్ర నిర్మాణం

బొమ్మనహాళ్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరహాళ్‌లో చెత్తతో సంపద కేంద్రం నిర్మాణం పిల్లర్ల దశలోని నిలిచిపోయింది. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.5లక్షలతో ఈ పనులను ప్రారంభించింది. ఆ పనులు కాంట్రాక్టర్ పిల్లర్ల దశ వరకు చేపట్టారు. అనంతరం 2019లో వైసీపీ అధికారంలోకి రావడం.. బిల్లులు రాకపోవడంతో ఆ పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది అయినా.. సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడంతో ఆ నిర్మాణ పనులను పునః ప్రారంభించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అర్థాంతరంగా నిలిచిపోయిన చెత్తతో సంపద కేంద్రం పనులు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విధుల్లోకి తీసుకోవాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులుగా పని చేస్తూ మరణించిన ఐదుగురి, రిటైరైన ఎనిమిది మంది కుటుంబ సభ్యులను వెంటనే విధుల్లో తీసుకోవాలని ఏఐటీయూసీ మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు వీరభద్రస్వామి డిమాండ్ చేశాడు. ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఆయన మాట్లాడారు. 2006లో మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులను విధుల్లో తీసుకున్నారని, ప్రస్తుతం వారిని ఆప్కాస్ విధానాన్ని తీసుకొనిరావడం జరిగిందని అన్నారు. 2022లో పలు మున్సిపాల్టీల్లో ఆప్కాస్ వర్కర్లు రిటైర్, మరణించిన వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకున్నారన్నారు. గుత్తి, అనంతపురం, ధర్మవరం, తాడిపత్రి, హిందూపురం మున్సిపాల్టీలో ఆప్కాస్ వర్కర్ల కుటుంబ సభ్యులను ఉద్యోగాలు కల్పించారన్నారు. అయితే గుంతకల్లు మున్సిపాలిటీలో 13 మందిని విధుల్లో తీసుకోకుండా.. మున్సిపల్ కమిషనర్ అనేక లోపాలను చూపుతూ అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించకపోతే పెద్దఎత్తున ఉద్యమాలకు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు నరసయ్య, జగదీష్, రంగనాయకులు, శ్యామూల్, ప్రేమ్‌కుమార్, ఏఐటీయూసీ నాయకులు చిన్న కొండయ్య, వాసు,వెంకటేసు, పెద్ద పెంచలయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రస్వామి

సంచార జాతుల విముక్తి దినోత్సవం



మాట్లాడుతున్న శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని స్థానిక సంచార జాతుల మహిళా సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసులు మాట్లాడుతూ.. భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను సంచార జాతులే కాపాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో బాలసంత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్రాక్ష కుళ్లాయప్ప, మహిళా సంఘం అధ్యక్షురాలు ఇందిరాదేవి, వంశరాజ్‌సంఘం నాయకులు పులిగప్ప, సుబ్బయ్య, కృష్ణ, మాదసి కురువసంఘం నాయకులు కడియాల శివ, బండిశేఖర్ పాల్గొన్నారు.

బడి చుట్టూ మురుగు

- కాలువ ఏర్పాటు చేయని వైనం
- దుర్వాసనతో సిబ్బంది, విద్యార్థుల ఇబ్బంది



పాఠశాల చుట్టూ నిల్వ ఉన్న మురుగునీరు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎల్‌వీ టాకీస్ సమీపంలో రవీంద్రనాథ్ ఠాగూరు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉంటూ మురుగునీరు నిల్వ ఉంటోంది. ఆ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో నాడు నేడు కింద పాఠశాల మరమ్మతులు, ప్రహారీని నిర్మించారు. అయితే మురుగు కాలువ నిర్మించకుండా వదిలేశారు. దీంతో ఆ పాఠశాలలోకి వెళ్లేందుకు కూడా దారి లేకపోవడంతో ఉపాధ్యాయులు రాళ్లు పెట్టి వాటి మీద చిన్న బండను ఏర్పాటు చేశారు. ఆ బండ మీద వెళ్లేటప్పుడు విద్యార్థులు ఎక్కడ మురుగులో పడి గాయపడతారో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాల చుట్టూ మురుగు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేటపుడు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌కు వివరణ కోరగా పాఠశాల చుట్టూ మురుగు కాలువలు ఎందుకు ఏర్పాటు చేయలేదో విచారిస్తామని, విద్యార్థులు, సిబ్బంకి ఇబ్బందులు లేకుండా కాలువ నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

పామిడి ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాదర్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2006లో పదో తరగతి చదివిన విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం సమావేశయ్యారు. నాటి గురువులను ఆహ్వానించి.. ఘనంగా సన్మానించారు.



వినాయకా.. వీడ్కోలిక..!

ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : పట్టణ, మండల కేంద్రాల్లో ఐదు రోజులపాటు విశేష పూజలందుకున్న గణనాథుడికి ఆదివారం భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. యువతీయువకుల కేరింతలు, నృత్యాలు చేస్తూ.. స్వామి వారిని సాగనంపారు. వర్షంలోనే తడుస్తూ.. గణేషుడిని గంగమ్మ ఒడికి చేర్చారు.



















పామిడి: ఎద్దులపల్లి రోడ్డులోని వినాయకుని లడ్డూను నెమల్లపల్లి ఓబుళపతి రూ.70 వేలకు, కండువాను దాసరి పవన్‌కుమార్ రూ.10వేలకు వేలంలో దక్కించుకున్నారు.



ఉరవకొండలో వినాయకుని లడ్డూను రూ.70 వేలకు వేలంలో దక్కించుకొన్న గోల్డ్ షాపు బబ్లూ

వినాయక విగ్రహాన్ని తొలగించరాదు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో గత కొన్నేళ్లుగా ఉన్న వినాయకుని విగ్రహాన్ని తొలగించే చర్యలు మానుకోవాలని విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు మద్దిలేటి సత్యనారాయణ ఆదివారం ప్రకటనలో కోరారు. విగ్రహాన్ని తొలగించి హిందువుల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు రీజనల్ డిపో మేనేజర్‌ను విజ్ఞప్తి చేశారు.